
ప్రజాశక్తి
సోమవారం 25 మార్చి 2024
5
విజయనగరం



కొనసాగుతున్న మిమ్స్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల చేపట్టిన నిరసన శిబిరం ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా మిమ్స్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.వి.రమణ మాట్లాడుతూ మిమ్స్ యాజమాన్యం మూడేళ్లుగా 7 డిఎ బకాయిలు ఇవ్వలేదని, 2019 నుంచి వేతన ఒప్పందం చేయలేదని చెప్పారు. ఉద్యోగులు, కార్మికులను మిమ్స్ యాజమాన్యం వేధించి, అడిగిన వారిని సస్పెండ్, బదిలీ చేయడం దుర్మార్గమన్నారు. కార్మిక శాఖాధికారులు కూడా యాజమాన్యానికి వత్తాసు పలుకుతూ సమర్థించడం భావ్యం కాదన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం వెంటనే స్పందించి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

కమలానికి చోటిస్తే సైకిల్‌కి చేటే



- టిడిపి కంచుకోటకు బీటలు తప్పవా?
- పది అసెంబ్లీ స్థానాల్లో ప్రభావం
- ఎమ్మెల్యే అభ్యర్థుల్లో గుబులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కమలం కలయికతో సైకిల్‌కు ఎదురీత ఎదురయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో టిడిపి పునాదులకు బీటలు వారడం ఖాయమంటూ పలువురు విశ్లేషిస్తున్నారు. అందుకు తగ్గట్టే టిడిపి నాయకులు, కార్యకర్తల్లో ఆందోళన, ఆవేదన వ్యక్తమౌతోంది. పొత్తులో భాగంగా ఇటు విజయనగరం, అటు అరకు పార్లమెంట్ స్థానాలు బిజెపికి కేటాయిస్తున్నట్లు ప్రకటించిన విషయం విధితమే. విజయనగరం పార్లమెంట్ అభ్యర్థిగా భీమవరానికి చెందిన కాశిరాజు, లేదా మాజీ ఎమ్మెల్సీ మాధవ్ సహా మరోపేరు పరిశీలనలో ఉన్నట్టుగా సమాచారం. అటు అరకు ఎంపీ అభ్యర్థిపేరును కూడా బిజెపి అధిష్టానం రెండు మూడు రోజుల్లో తేల్చే అవకాశం ఉందని సమాచారం. ఈ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోనే విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 10 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వాస్తవానికి ఈ రెండు జిల్లాలు టిడిపికి కంచుకోట వంటివి. 1981లో ఆవిర్భావం నుంచి జిల్లాలో టిడిపికి ఆదరణ పెరుగుతూ వచ్చింది. 1994 సార్వత్రిక ఎన్నికల్లో అప్పటి ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 12అసెంబ్లీ స్థానాలనూ టిడిపి క్లీన్ స్వీప్ చేసింది. ఆ తరువాత క్రమంగా అసెంబ్లీ స్థానాలు తగ్గిన సందర్భాల్లో కూడా జిల్లా స్థాయిలో ప్రతిపక్ష పాత్ర పోషించింది. 2014 ఎన్నికల్లోనూ టిడిపివే మెజార్టీ స్థానాలు. అనంతరం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతో భాగస్వామిగా ఉన్నప్పటికీ విభజన హామీలు అమలుకు కృషి చేయకపోవడంతో 2019 ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వీచిన వ్యతిరేకగాలిలో ఉమ్మడి విజయనగరం జిల్లాలో టిడిపి కొట్టుకుపోయింది. అయినప్పటికీ గ్రామ, మండల, జిల్లా స్థాయిలో టిడిపి బలంగానే ఉంది. వైసిపి అధికారంలోకి వచ్చాక అనేక నిర్బంధాలు, బెదిరింపులు తట్టుకుని కేడర్ నిలబడింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనేక జిల్లాల్లో టిడిపి పోటీలో దిగలేని పరిస్థితులు ఏర్పడినప్పటికీ, ఇక్కడ దాదాపు అన్ని చోట్లా టిడిపి శ్రేణులు పోటీలో నిలిచాయి. బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో సర్పంచ్, ఎంపిటిసి స్థానాలు వైసిపికి ధీటుగా వచ్చాయి. చాలా చోట్ల టిడిపి గట్టిపోటీ కూడా ఇచ్చింది. ఇటువంటి పరిస్థితుల్లో తిరిగి టిడిపి ఎప్పటికైనా అధికారంలోకి రాబోతుందా? స్థానికంగా ఉన్న నాయకులే ఎంపీ, ఎమ్మెల్యేలు కాబోతారా అని అని ఎదురు చూశారు.

కానీ, ఆశలు తలకిందులయ్యే విధంగా విజయనగరం, అరకు లోక్ సభ స్థానాలను నామమాత్రంగానైనా ఓట్లు లేని బిజెపికి పొత్తులో భాగంగా కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. గత ఎన్నికల్లో విజయనగరం పార్లమెంట్ బిజెపి అభ్యర్థి పాకలపాటి సన్యాసిరాజుకు కేవలం 7,266 (0.6శాతం) ఓట్లు మాత్రమే వచ్చాయి. టిడిపి తరపున ఓడిపోయిన మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజుకు 5,30,382 ఓట్లు వచ్చాయి. ఇటువంటి పరిస్థితుల్లో పార్టీని, అశోక్ వంటి సీనియర్ నేతను పక్కనబెట్టి బిజెపికి, అందులోనూ స్థానికేతర నేతలకు అవకాశం ఇవ్వ జూపడాన్ని తెలుగు తమ్ముళ్లు జీర్ణించుకోలేకపోతున్నారు. రాష్ట్రానికి మోసం చేసినందన్న బిజెపితో తెగదెంపులు చేసుకుని, తిరిగి పొత్తుపెట్టుకోవడం సబబు కాదని కొందరు, అసలు ఓట్లే లేని పార్టీకి ఈ రెండు జిల్లాల్లో 10 అసెంబ్లీ స్థానాలను ప్రభావితం చేసే పార్లమెంట్ స్థానాలు కట్టబెట్టడమేమిటని మరికొందరు రగిలిపోతున్నారు.

నెల్లిమర్ల అసెంబ్లీ స్థానం జనసేనకు కేటాయించడంతో అక్కడ పూర్తిగా సైకిల్ గుర్తే కానరాని పరిస్థితి ఏర్పడనుంది. మరోవైపు, తమ పార్టీ (టిడిపి) ఓట్లతో స్థానిక ఎంపీలుగా బిజెపి నాయకులు అధికారం చెలాయిస్తే ఉత్తరభారతదేశంలో మాదిరిగా కులం, మతంతో ప్రజల మధ్య చిచ్చురేపే ప్రమాదం లేకపోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రామతీర్థంలో రాముని విగ్రహం శిరస్సును ఖండించిన ఘటనను కూడా మతాల మధ్య చిచ్చురేపేందుకు బిజెపి తీవ్రంగా ప్రయత్నించిందని కూడా తెలుగు తమ్ముళ్లు గుర్తుచేసుకుంటున్నారు. విజయనగరం జిల్లా అంటే మత సామరస్యానికి ప్రతీక. అంటరానితనం వంటి దూరాచారాలకు దూరంగానే ఉంటుంది. కళలు, సంస్కృతి, సంప్రదాయాలకు నిలయంగావున్న ఉమ్మడి విజయనగరం జిల్లాలో మతోన్మాద అజెండాలతో నిత్యం కలహాలు సృష్టించే బిజెపి బీజానికి అవకాశం కల్పిస్తే టిడిపి కూకటివేళ్లు పెకిలించే ప్రమాదం కూడా లేకపోలేదనే వాదన కూడా వ్యక్తమౌతోంది. యువతరం పేరుతో జిల్లాలోని సీనియర్లను పక్కనెబట్టినప్పటికీ లోక్ సభ స్థానంలో బిజెపికి కట్టబెట్టడం వల్ల మొదటికే మోసం వస్తుందనే తెలుగు తమ్ముళ్లు అంటున్నారు. ఇవే కారణాలతో మాజీ కేంద్ర మంత్రి వైరిచర్ల కిశోర్ చంద్రదేవ్ ఏకంగా టిడిపి పార్టీకే రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి అశోక్ లేదా జిల్లాకు చెందిన టిడిపి నేతలకు అవకాశం కల్పించడమే సరైన మార్గమని చెప్పుకుంటున్నారు. బహుశా అందుకేనేమో టిడిపి పునరాలోచనలో పడినట్లు చర్చ జరుగుతోంది. ఈనేపథ్యం లో విజయనగరం పార్లమెంట్ సీటు తమకు తీసుకొని, రాజంపేట పార్లమెంట్ స్థానాన్ని బిజెపికి ఇచ్చింది. అరకు నుంచి కొత్తపల్లిగీతను బిజెపి అభ్యర్థిగా ఆ పార్టీ ప్రకటించింది. దీంతో విజయనగరంపైనే అందరి చూపు ఉంది.



సమావేశానికి హాజరైన గొంప కృష్ణ అభిమానులు

టిడిపిలో భగ్గుమన్న అసమ్మతి

- తిరుగుబాటు బావుట ఎగురవేసిన గొంప కృష్ణ గ్రూపు
- స్వతంత్రంగా పోటీకి రంగం సిద్ధం
- పట్టణంలో భారీ ర్యాలీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

టిడిపి శృంగవరపుకోట ఎమ్మెల్యే టికెట్‌ను కోళ్ల లలితకుమారికి కేటాయించడంతో గొంప కృష్ణ గ్రూపు భగ్గుమంది. ఆదివారం పట్టణంలోని విశాఖ-అరకు రహదారికి ఆనుకొని ఉన్న గొంప కృష్ణ కార్యాలయం వద్ద ఆయన గ్రూపు 'కృష్ణతో మేము' అనే కార్యక్రమం ఏర్పాటుచేసింది. ఈ సందర్భంగా గొంప కృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలో టిడిపి పూర్తి నిస్తేజంలో ఉన్న సమయంలో నారా చంద్రబాబునాయుడు, లోకేష్ తనను ఇక్కడ సేవా, పార్టీ కార్యక్రమాలు కూడా చేపట్టాలని చెప్పారని, తనకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అప్పటినుంచి నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలతో పాటు పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా చేసి నియోజకవర్గంలో టిడిపి అంటే గొంప కృష్ణ అనే స్థాయికి తీసుకువచ్చానని తెలిపారు. కానీ ఆఖరి నిమిషంలో కొన్ని ప్రలోభాల కారణంగా టికెట్ తనకు ప్రకటించలేదని చెప్పారు. అయినా నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు ఇక్కడే ఉండి ప్రజాభీష్టం మేరకు స్వతంత్రంగా పోటీ చేస్తానని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయం నుండి దేవి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని దుర్గ దేవిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అభిమానులతో కలిసి ర్యాలీగా వెళ్తున్న గొంప కృష్ణ

గొంప కృష్ణ నాయకత్వం అవసరం

వేపాడ : శృంగవరపుకోట నియోజకవర్గంలో ప్రస్తుతం టిడిపికి గొంప కృష్ణ నాయకత్వం అవసరమని సీనియర్ న్యాయవాది గొంప వెంకటరమణ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చింది గొంప కృష్ణేనని తెలిపారు. అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు దగ్గరయ్యారని చెప్పారు. అలాంటి వ్యక్తికి టికెట్ ఇవ్వకుండా, గతంలో ఓటమి పాలైన వ్యక్తికి ఇవ్వడం సరికాదన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ ఏవిపి పట్టాభిరామ్ రెడ్డి

చెరకు క్రషింగ్ పూర్తి

ఇఐడి ప్యారి అసోసియేట్ ఉపాధ్యక్షులు పట్టాభిరామ్‌రెడ్డి

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని సంకిలి ఇఐడి ప్యారి సుగర్స్‌లో ఆదివారంతో చెరకు క్రషింగ్ పూర్తి అయినట్లు సంస్థ అసోసియేట్ ఉపాధ్యక్షులు పట్టాభిరామ్‌రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం కర్మాగార సమావేశం మందిరంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో చెరకు క్రషింగ్ 4 లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యం కాగా, 3,92,750 లక్షల మెట్రిక్ టన్నులు పూర్తిచేసినట్లు వెల్లడించారు. గతేడాది 10.02 శాతం రికవరీ రాగా, ఈ ఏడాది 9.09 శాతం రికవరీ వచ్చినట్లు తెలిపారు. ఈ సీజన్ ముందుగా క్రషింగ్ ప్రారంభించినట్లు తెలిప్పారు. చెరకు క్రషింగ్ విజయవంతంగా ముగిసిందన్నారు. ఈ ఏడాదికి చెరకు క్రషింగ్‌కు సహకరించిన రైతులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. వాతావరణం, సాంకేతిక పరంగా ఇబ్బందులు ఎదుర్కొన్న లక్ష్యాలు పూర్తి చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు లచ్చయ్యపేట సుగర్స్ నుంచి 9,709, భీమసింగి సుగర్స్ నుంచి 6,632 మెట్రిక్ టన్నుల చెరకు ఆడినట్లు తెలిపారు.

వచ్చే ఏడాది చెరకు క్రషింగ్‌కు 18 వేల ఎకరాలు సాగులో ఉందన్నారు. రైతులు మొక్కజొన్న, వరి వైపు దృష్టిసారించినట్లు తెలిపారు. గ్రామాల్లో చెరకు పంటలపై అవగాహన కల్పించి సాగు పెంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చెరకు సరఫరా చేసిన రైతులకు వెంటనే బిల్లులు చెల్లించామని తెలిపారు. సమావేశంలో కేన్ జిఎం రాజేంద్రన్, హెచ్‌ఆర్ హెడ్ మేనేజర్ మురళీకృష్ణ, ఫైనాన్షియల్ ఎజిఎం శ్యామ్‌కుమార్ ఉన్నారు.

రేగిడి, వెంకటాపురం కేంద్రంగా

ఇసుక అక్రమ రవాణా

చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-రేగిడి

మండలంలో ఇసుకాసురుల ఆగడాలు రోజురోజుకు పెచ్చుమీరుతున్నాయి. రేగిడి, కొమిరి వెంకటాపురం గ్రామాల కేంద్రంగా నాగావళి నది నుంచి ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అనుమతులు లేకుండా, అడ్డు, అదుపు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. సర్కారు ఆదాయానికి గండికొట్టి ఇసుకాసురులు రూ.లక్షల్లో కాసులు వెనకేసుకుంటున్నారు.

రేగిడి మండల కేంద్రానికి కూతవేటులో ఉన్న నాగావళి నది నుంచి రేయింబవళ్లు ఇసుక అక్రమ రవాణా సాగుతోంది.



రేగిడిలో ఇసుక డంపింగ్ ఇదే



ఉంగరాడ మెట్ట నుంచి అక్రమంగా వెళుతున్న ఇసుక ట్రాక్టర్

అయినా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరించడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొమిరి వెంకటాపురం గ్రామం నుంచి రోజువారిగా వందలాది లారీలు, ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా జరిగినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇసుక అక్రమ రవాణాలో కీలక నేతలు ఉన్నట్లు తెలుస్తోంది. పత్రికల్లో ఎన్నోసార్లు ఇసుక అక్రమ రవాణాపై కథనాలు వస్తే వారం రోజుల వరకు ఇసుక రవాణా ఆపేసి, ఆ తరువాత దందా ప్రారంభిస్తున్నారు. దీని వెనుక నేతలు లేకుంటే ఇసుక అక్రమ రవాణా ఎలా జరుగుతుందని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఉంగరాడ, బూరాడ గ్రామ జంక్షన్‌లో చెక్‌పోస్టులు ఉన్నప్పటికీ పోలీసులు తనిఖీలు నిర్వహించకుండా, ఇసుక లారీలు, ట్రాక్టర్లను వదిలేయడం విడ్డూరంగా ఉందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

వాలంటీర్ తొలగింపు

ప్రజాశక్తి-విజయనగరం

సోషల్ మీడియాలో ఒక రాజకీయ పార్టీ నాయకునికి అనుకూలంగా పోస్టులు పెట్టిన ఎల్.కోట మండలానికి చెందిన ఒక గ్రామ వాలంటీర్‌ను విధుల నుంచి తొలగించినట్టు జిల్లా ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ఎల్.కోట మండల ఖాసాపేట గ్రామ సచివాలయం పరిధిలోని వాలంటీరు బొబ్బిలి శివ ఒక రాజకీయ నాయకుడికి అనుకూలంగా సోషల్ మీడియా వేదికల్లో పోస్టు నమోదు చేసినట్టు ఫిర్యాదు అందడంతో అధికారులు విచారణ చేపట్టారు. ఆరోపణలు నిర్ధారణ కావడంతో ఆ వలంటీర్‌ను విధుల నుంచి తొలగించినట్టు పేర్కొన్నారు.

భోగాపురం, పోలిపల్లిలో పండగ సందడి

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని భోగాపురం, పోలిపల్లి గ్రామాల్లో పండగ సందడి ఆరంభమైంది. సోమ, మంగళ, బుధవారాల్లో ఆ గ్రామాల్లో పండగలు నిర్వహించనున్నారు. ఇప్పటికే పండగలకు సంబంధించిన ఏర్పాట్లను ఉత్సవ కమిటీ పూర్తిచేసింది. పోలిపల్లి గ్రామంలో 143వ పైడితల్లి అమ్మవారి పండుగను నిర్వహిస్తున్నారు. యాత్రికులకు ఇబ్బందులు కలగకుండా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసింది. భోగాపురం గ్రామంలో కనకదుర్గ అమ్మవారి పండగను ప్రతి ఏటా నిర్వహిస్తుంటారు. ఈ పండగలకు అధిక సంఖ్యలో యాత్రికులు తరలివస్తుంటారు. చివరి రోజు బుధవారం సాయంత్రం సంగిడి రాళ్ల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేస్తారు.

మాకెందుకీ టెన్షన్!

- టిడిపి కార్యకర్తల్లో ఆందోళన
- అభ్యర్థిని ప్రకటించండంటూ వేడుకోలు

ప్రజాశక్తి-చీపురుపల్లి

'మాకెందుకీ టెన్షన్? అభ్యర్థిని ప్రకటించి పుణ్యం కట్టుకోండి!.. ఎదుటి పార్టీవారు ప్రచారంలో దూసుకుపోతున్నారు. అభ్యర్థిని ప్రకటించక పోవడంతో మాకు బిపి లెవెల్స్ పెరిగి పోతున్నాయి. త్వరగా అభ్యర్థిని ప్రకటించి పుణ్యం కట్టుకోండి' అంటూ తమ నాయకుల వద్ద టిడిపి కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలై పది రోజులు గడుస్తున్నా అభ్యర్థి ఎవరో తెలియక తాము ప్రజలకు సమాధానం చెప్పలేక పోతున్నామని వాపోతున్నారు. ఒకవైపు ఎదుటి పార్టీ వారు



గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఇప్పటికే రెండు మూడు దఫాలుగా తమ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేస్తుంటే, టిడిపి అభ్యర్థి ఎవరంటూ ప్రజలు తమను అడుగుతున్నారని మండలంలో ఒక నాయకుడి వద్ద టిడిపి కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇంతకీ టిడిపి అభ్యర్థిని ప్రకటిస్తారా? లేదా అనే సందేహం కూడా తమలో కలుగుతుందనే భావన కూడా కార్యకర్తలు సదరు నాయకుడి వద్ద ప్రస్తావించినట్లు తెలిసింది. అంతే కాకుండా టిడిపి అభ్యర్థిని వెంటనే ప్రకటించకపోతే తమదారి తాము చూసుకుంటామంటూ కార్యకర్తలు సదరు నాయకుడితో తెగేసి చెప్పినట్లు సమాచారం. టిడిపి అధినాయకత్వం చీపురుపల్లి నియోజకవర్గ అభ్యర్థిని ఎప్పటికి ప్రకటిస్తుందో వేచి చూడాల్సిందే.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కవాతు

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన పోలిపల్లి, లింగాలవలసలో ఆదివారం కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రవికుమార్ మాట్లాడుతూ ఎస్‌పి ఆదేశాల మేరకు ఎన్నికల్లో సమస్యాత్మక గ్రామాల్లో ఎటువంటి వివాదాలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు సూర్యకుమారి, తాతారావు పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రైయినీ అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్, డిఎంహెచ్ఒ భాస్కరరావు

క్షయలేని సమాజమే లక్ష్యం

ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్


ప్రజాశక్తి-విజయనగరంకోట

క్షయ లేని సమాజం అందరి లక్ష్యం కావాలని ట్రైనీ సహాయ కలెక్టర్ బి.సహదిత్ వెంకట్ త్రివినాగ్ పేర్కొన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ వ్యాధిపై ప్రజల్లో నెలకొని వున్న అపోహలను తొలగించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే పూర్తిగా నయం చేయవచ్చునని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన ప్రస్తుత పరిస్థితుల్లో ఈ వ్యాధి నిర్ధారణ మరింత సులువుగా మారిందని, దీనిని వినియోగించుకొని ప్రతి కేసును గుర్తించడం ద్వారా వ్యాధిని పూర్తిగా నిర్మూలించగలమన్నారు. వ్యాధి నయం చేసేందుకు ప్రభుత్వమే రోగులకు పూర్తిస్థాయిలో మందులు అందజేస్తోందని, వాటిని వైద్యులు సూచించిన విధంగా వినియోగించి వ్యాధి నుంచి విముక్తి పొందాలన్నారు. ఈ సందర్భంగా జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించి, క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. క్షయవ్యాధిని కనుగొన్న రాబర్ట్ కోచ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు మాట్లాడుతూ సకాలంలో వ్యాధిని గుర్తించి మందులు వేసుకుంటే వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. ఆధునిక పద్ధతుల్లో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నందున టిబి నిర్ధారణ సులభతరమైందని జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ గౌరీశంకర్ అన్నారు. ప్రతి గర్భిణీ ప్రసవం అయిన వెంటనే శిశువుకు బిసిజి టీకా తక్షణమే వేయిస్తే ముమ్ముందు టిబి వ్యాధి సోకకుండా నియంత్రించగలమన్నారు. జిల్లా క్షయవ్యాధి నియంత్రణ అధికారిణి డాక్టర్ రాణి మాట్లాడుతూ జిల్లాలో అన్ని ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా క్షయ నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల్లేని నగరంగా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మళ్లీ గెలిపిస్తే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతామని వైసిపి అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఆదివారం నగరంలోని 6, 7 డివిజన్ ప్రాంతాలలో జరిగిన ఇంటింటి ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 7వ డివిజన్ కార్పొరేటర్ పొంతపల్లి మాలతి, జోనల్ ఇంచార్జ్ బోడసింగి ఈశ్వరరావు మాట్లాడుతూ వీరభద్ర స్వామి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, జోనల్ ఇన్చార్జిలు బొద్దాన అప్పారావు, రెడ్డి గురుమూర్తి, 6వ డివిజన్ కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి, మాజీ కౌన్సిలర్ కోరాడ సూర్య ప్రభావతి, వైసిపి నాయకులు పొంతపల్లి గోపి, మజ్జి శ్రీను, ఆకుల రమేష్ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

అరకు బిజెపి ఎమ్‌పి అభ్యర్థిగా గీత

ప్రజాశక్తి - పార్వతీపురం

అరకు పార్లమెంటు నియోజకవర్గ బిజెపి అభ్యర్థిగా కొత్తపల్లి గీతను ఆ పార్టీ అధిష్టానం ఆదివారం రాత్రి ప్రకటించింది. గీత 2014లో జరిగిన ఎన్నికల్లో వైసిపి తరపున పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత ఆమె కులవివాదం కేసును ఎదుర్కొన్నారు. అనంతరం బిజెపి తీర్థం పుచ్చుకున్న ఆమె ప్రస్తుతం ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్నారు. తాజాగా అరకు టిక్కెట్టు దక్కించుకున్నారు.



కోడ్ ఉల్లంఘనపై 'సి విజిల్' కొరడా

- పౌరులకు అందుబాటులో 'సి విజిల్' యాప్
- అందిన ఫిర్యాదుకు 100 నిమిషాల్లో చర్యలు

రాష్ట్ర ప్రజల భవిష్యత్తును దిశా నిర్దేశం చేసే.. సార్వత్రిక ఎన్నికలకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమల్లోకి వచ్చేసింది. ఈ ఎన్నికలు రాజకీయ పార్టీలకు ఎంతో ప్రతిష్టాత్మకంగా మారాయి. ఈ నేపథ్యంలో అక్రమాలకు, నిబంధనల ఉల్లంఘనలకు అవకాశాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. వాటికి అడ్డుకట్ట వేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసింది. ఇందులో పౌరులను సైతం భాగస్వాములను చేస్తోంది. 'సి విజిల్' యాప్ ద్వారా ఈ అవకాశం కల్పించింది. దాని గురించి తెలుసుకుని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై అధికారులు చర్యలు తీసుకునేలా.. ఎన్నికలు పారదర్శకంగా, సజావుగా, ప్రశాంతంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత మనందరిది.

– ప్రజాశక్తి, విజయనగరం



'సి విజిల్' యాప్ అంటే ?

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఈ సి విజిల్ యాప్ అందుబాటులోకి వచ్చింది. ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాలతో సహా అందులో పొందుపరచవచ్చు. ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డ్ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై విచారణ చేపట్టి వంద నిమిషాల్లో సదరు ఫిర్యాదుపై కచ్చితమైన చర్యలు తీసుకుంటారు. దీన్ని పౌరులు ఎవరైనా వినియోగించవచ్చు. పార్టీలకు అతీతంగా ఎవరు అవినీతికి పాల్పడినా ఈ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

యాప్‌లో ఇలా రిజిస్టర్ చేసుకోవాలి

ముందుగా గూగుల్ ప్లే స్టోర్‌లో కేంద్ర ఎన్నికల సంఘం తీసుకొచ్చిన సి విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. మీ సెల్ ఫోన్ నంబరు ద్వారా దానిలో రిజిస్టర్ చేసుకోవాలి. ఒటిపి వస్తుంది. దాన్ని నమోదు చేస్తే సి విజిల్ యాప్ సిద్ధమైనట్లే. దాని ద్వారా మీరు ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.

వీటిపై ఫిర్యాదు చేయొచ్చు

ఎన్నికల ప్రవర్తనా నియమావళికి భిన్నంగా ఉన్న దేనిపైనైనా ఫిర్యాదు చేయవచ్చు. డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతుల అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం. ఇలాంటి కోడ్ ఉల్లంఘనలను ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రికార్డ్ చేసి అప్‌లోడ్ చేయండి. వ్యక్తిగత ఫిర్యాదులు చేయడానికి అవకాశం లేదు.

ఫిర్యాదు ఇలా చేయాలి

యాప్ తెరవగానే తెరపై 'ఫొటో', 'వీడియో', 'ఆడియో' అనే మూడు ఆప్షన్లు ఉంటాయి. మీరు ఫొటో ద్వారా ఫిర్యాదు చేయాలనుకుంటే ఫొటో ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. మీ లొకేషన్ నమోదవుతుంది. ఉల్లంఘనకు సంబంధించిన ఫొటో, లేదా 2 నిమిషాల వీడియోను అప్‌లోడ్ చేయండి. ఏ రాష్ట్రం, ఏ నియోజకవర్గం తదితర వివరాలను నమోదు చేయాలి. సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరించాలి. ఇది ఎన్నికల సంఘానికి చేరుతుంది.

100 నిమిషాల్లో చర్యలు పూర్తి

యాప్‌లో వివరాలు పొందుపరచగానే జిల్లా ఎన్నికల అధికారి ఐదు నిమిషాల్లో.. దానిని ఫీల్డ్ యూనిట్‌కు పంపిస్తారు. వారు 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటారు. విచారించి, 30 నిమిషాల్లో వివరాలు సేకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారికి నివేదిస్తారు. అనంతరం దానిపై 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఇలా 100 నిమిషాల్లో సి విజిల్ యాప్‌లో చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారు. మీరు చేసిన ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకునే వెసులుబాటు ఉంది.

అక్రమాలపై ఫిర్యాదు చేయండి



తాయిలాలు పంచి, అక్రమాలకు పాల్పడి అధికార పీఠం ఎక్కాలనుకునే వారికి ఈ యాప్ ద్వారా చరమ గీతం పాడొచ్చు. ఈ రోజే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని.. ఎక్కడైనా ఎన్నికల నియమావళి ఉల్లంఘన కనిపిస్తే ఫిర్యాదు చేయండి. అక్రమాలకు అడ్డుకట్ట వేయండి. మీ పిల్లలు, రాష్ట్ర బంగారు భవిష్యత్తు కోసం.. మీ బాధ్యతను నిర్వర్తించండి. ప్రజాస్వామ్య పరిరక్షణలో మీరు కూడా భాగస్వాములు కండి.

– నాగలక్ష్మి, జిల్లా కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్

ఆదరిస్తే అభివృద్ధి చేస్తా

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-బొండపల్లి

రానున్న ఎన్నికలో తనను ఆదరించి.. ఆశీర్వదిస్తే గజపతినగరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం టిడిపి ఆధ్వర్యాన కూటమి బొండపల్లి మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తాత కొండపల్లి పైడితల్లి నాయుడు జెడ్‌పి చైర్మన్‌గా, ఎమ్‌పిగా ప్రజలకు సేవలు అందించి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. తాను కూడా ఆయన బాటలో నడుస్తూ ఆశయ సాధనకు కృషిచేస్తానన్నారు. తన తాతయ్య, బాబాయిలను గెలిపించినట్లే తననూ ఆశీర్వదించాలని అభ్యర్థించారు. యువతకు ఉపాధి అవకాశాలు తీసుకు వస్తానని, రైతు సంక్షేమానికి పాటు పడతానని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మాజీ మంత్రి పడాల అరుణ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని కూటమి కట్టినట్లు తెలిపారు. జనసేన నియోజకవర్గ నాయకులు మర్రాపు సురేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే అప్పలనరసయ్య అభివృద్ధి చెందారే తప్ప గ్రామాల అభివృద్ధి శూన్యమన్నారు. సమావేశంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు దేవర ఈశ్వర్ రావు, మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు, మాజీ వైస్ ఎంపిపి బొడ్డు రాము, టిడిపి సీనియర్ నాయకులు శనపతి శ్రీనివాసరావు, బండారు కృష్ణమూర్తి, రాపాక అచ్చెంనాయుడు, కళ్యాణపు నారాయణరావు, తాళ్లపూడి రమణ, బోదంకి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలని నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమల రావు పిలుపునిచ్చారు. ఆదివారం ఓటు యొక్క ఆవశ్యకత, విశిష్టత గూర్చి అవగాహన కల్పించేందుకు విజ్జి స్టేడియంలో వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ మానవహారంగా ఏర్పడి ఓటు ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధం వంటిదని అన్నారు. ఓటుకు మించిన ఆయుధం వేరొకటి లేదని అన్నారు. ప్రజలందరూ తప్పనిసరిగా పోలింగ్ రోజున తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, సలీం రాజు, రామకృష్ణ, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.


పవన్ కళ్యాణ్‌తో సుజయకృష్ణ రంగారావు, వర్మ

పవన్‌ను కలిసిన సుజయ్‌కృష్ణ

ప్రజాశక్తి-బొబ్బిలి

జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను మాజీ మంత్రి, టిడిపి తూర్పుగోదావరి జిల్లా పరిశీలకులు సుజయకృష్ణ రంగారావు, పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వర్మ కలిశారు. ఆదివారం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో పవన్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్ర, పిఠాపురం రాజకీయ పరిస్థితులపై చర్చించారు. రానున్న ఎన్నికల్లో కూటమి గెలుపునకు పని చేయాలని పవన్ కళ్యాణ్ కోరారు.

షర్మిల ఆదేశిస్తే పోటీకి సిద్ధం

ప్రజాశక్తి-బొబ్బిలి

పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశిస్తే బొబ్బిలి నియోజకవర్గంలో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. బొబ్బిలి మున్సిపాలిటీ ఏర్పడి ఐదు దశాబ్దాలు పూర్తయినా అభివృద్ధి చెందలేదని చెప్పారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని తెలిపారు.


అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఘనంగా మారుజాతర

ప్రజాశక్తి-చీపురుపల్లి


చీపురుపల్లిలో కనకమహాలక్ష్మి అమ్మ వారి మారుజాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఈ నెల 17, 18, 19 తేదీల్లో కనకమహాలక్ష్మి అమ్మ వారి జాతర జరిగిన విషయం తెలిసిందే. అయితే జాతర జరిగిన మరుసటి ఆదివారం మారుజాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఆదివారం అమ్మవారి మారు జాతరను ఆలయ కమిటీతో పాటు ఇఒ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున యాత్రికులు వచ్చారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీఎత్తున అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాశరావు, వైస్ చైర్మన్ సూరు కుమారస్వామి, సభ్యులు కంది శ్రీరాములు, వంకల కృష్ణ, అడ్డాల రవి, బుంగ కనకేశ్వరరావు, రేగిడి అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా డోలయాత్ర

బొబ్బిలి : పట్టణంలోని డోలయాత్ర ఘనంగా జరిగింది. వేణుగోపాలస్వామి ఆలయం నుంచి ఉత్సవ విగ్రహానికి ఊరేగింపుగా పూల్‌బాగ్‌లో ఉన్న డోల మండపానికి తీసుకొచ్చారు. అనంతరం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన ప్రత్యేక పూజలు చేశారు.


భక్తి శ్రద్ధలతో మట్టలాదివారం

బొబ్బిలి : స్థానిక మహారాణిపేటలో సెయింట్ ఆండ్రూస్ లూథరన్ చర్చిలో ఆదివారం ఎఇఎల్‌సి డెలిగేట్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు భక్తిశ్రద్ధలతో మట్టలాదివారాన్ని నిర్వహించారు. మట్టలు చేత పట్టుకొని ప్రార్థనలు నిర్వహించారు. చర్చ్ పాస్టర్ రెవ పి జాన్ విక్టర్, సంఘ ప్రతినిధులు బి.రాజు, డేవిడ్ జె విక్టర్, తదితరులు పాల్గొన్నారు.



వైసిపికి షాక్

జనసేనలో భారీగా చేరికలు


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న మాధవి, శివశంకర్

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలో అధికార పార్టీకి గట్టి షాక్ తగిలింది. పలు గ్రామాలకు చెందిన వారు వైసిపిని వీడి జనసేనలో చేరారు. మండలంలోని ఇప్పలవలస పరిసర ప్రాంతాల్లో చింత కాశీనాయుడు అధ్యక్షతన జనసేన సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ శంకర్ హాజరయ్యారు. మీసాల పేట, గుర్ల, పెదమేడపల్లి, ఆంద్ర, కొంపెంగి, రాబంద, చల్లపేట, కొండలింగాలవలస, ఇప్పలవలస, చింతాడవలస, బుచ్చిరాజుపేట, ఉద్దంగి, కుంటినవలస గ్రామాల నుంచి వైసిపిని సుమారు వెయ్యి మంది వీడి, జనసేన తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు విష్ణువర్ధన్, రాజశేఖర్, మండల సురేష్, పాండ్రంకి శ్రీను, టిడిపి నాయకులు చలుమూరి వెంకటరావు, గెద్ద అన్నవరం, గొర్లె ముసలినాయుడు, రాయిపిల్లి రవిశంకర్, రాజగోపాల్ పాల్గొన్నారు.

జనసేన, టిడిపిలో చేరికలు

డెంకాడ : మండలంలోని పెదతాడివాడ గ్రామంలో పలువురు జనసేన, టిడిపిలో ఆదివారం చేరారు. గ్రామంలో ఉమ్మడి పార్టీ కార్యాలయం ప్రారంభించారు. అనంతరం జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి, టిడిపి నాయకుల ఆధ్వర్యంలో ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి రామ్మూర్తి, గాదిపల్లి చిన్న రామ్మూర్తి, చిరంజీవి రాజుతో సహా సుమారు 150 మంది పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

వైసిపి సర్పంచ్ టిడిపిలో చేరిక

విజయనగరం కోట : విజయనగరం మండలం గుండాలపేట సర్పంచ్ కంది జగదీశ్వరి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కంది మహేష్, వార్డు మెంబర్లు తోపాటు 50 కుటుంబాల వారు ఆదివారం అశోక్ బంగ్లాలో టిడిపి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారికి టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, కార్యాలయ కార్యదర్శి వేచలపు శ్రీనివాసరావు, రాష్ట్ర బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

కారకులను కఠినంగా శిక్షించాలి

రాష్ట్ర చేనేత సాధికార కమిటీ కన్వీనర్ దేవేంద్ర నాథ్

ప్రజాశక్తి-విజయనగరంకోట

కడప జిల్లా ఒంటిమిట్ట మండలం మాధవర గ్రామంలో చేనేత కార్మికుడి కుటుంబం ఆత్మహత్యకు కారకులైన వైసిపి నాయకులను శిక్షించాలని రాష్ట్ర చేనేత సాధికార కమిటీ కన్వీనర్ మామిడి దేవేంద్రనాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం అశోక్‌బంగ్లాలో జరిగిన టిడిపి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిని నాయకుడి భూదాహానికి పాల సుబ్బారావు అనే చేనేత కార్మికుడు బలయ్యాడని తెలిపారు. భూమికి సంబంధించిన విషయంలో వైసిపి నాయకులు బెదిరింపులు తట్టుకోలేక ఆయన ఆత్మహత్య చేసుకోగా, అది తట్టుకోలేక అతని భార్య, చిన్నకుమార్తె ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం కుల వృత్తులకు న్యాయం చేయకపోగా వారి ఆస్తులను కబ్జా చేసి రోడ్డుమీదకు నెడుతోందన్నారు. తనకు జరుగుతున్న అన్యాయంపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోపోవడంతో ఆత్మహత్యలు చేసుకోవాల్సి వచ్చిందన్నారు. చేనేత కార్మిక కుటుంబం ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. అనంతరం అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ ఇలాంటి రాక్షస పాలనను అంతమొందించే రోజు వచ్చిందని, ప్రజలందరూ చంద్రబాబును గెలిపించాలని కోరారు. అంతకుముందు మృతి చెందిన చేనేత కార్మికుల చిత్రపటాల వద్ద నివాళు లర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, రాష్ట్ర బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.


చేనేత కార్మికుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వినాయక నగర్‌లో తాగునీటికి ఇక్కట్లు

- 17 ఏళ్లుగా ఆరుబయటే కాలకృత్యాలు
- పట్టించుకోని పాలకులు


కనీస సౌకర్యాలకు నోచనీ వినాయకనగర్ కాలనీ ఇదే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని అన్ని పట్టణాలకు, గ్రామాలకు ఆదర్శంగా నిలవాల్సిన జిల్లా కేంద్రంలో ప్రజలకు మౌలిక వసతులు లేక తెల్లబోతోంది. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దామని, అన్ని విధాలా అభివృద్ధి చేశామని చెబుతున్న పాలకులు శివారు కాలనీలకు కనీసం మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు కల్పించకపోవడంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. 17 ఏళ్లుగా మరుగుదొడ్లు, తాగునీరు లేకపోగా, చిన్నారులు చదువు కోసం కూడా మూడు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఇది ఎక్కడో మారు మూల గ్రామంలో ఉన్న దుస్థితి కాదు,జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌కు దగ్గరలో ఉన్న వినాయక నగర్ వాసుల దుస్థితి.

వినాయకనగర్ కాలనీ ఏర్పడి సుమారుగా 17 ఏళ్లు అయ్యింది. ఎన్నికలప్పుడు మినహా మిగతా రోజుల్లో ఈ కాలనీవైపు ప్రజాప్రతినిధులు, పాలకులు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఫలితంగా కాలనీ వాసులు మరుగుదొడ్లు, తాగునీరు వంటి మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీలో 30 నివాసాలు ఉన్నాయి. చుట్టూ పక్కల అన్ని లే అవుట్ స్థలాలే. వినయకనగర్ వెనుక ఉన్న లే అవుట్ వ్యాపారం కోసం ఒక మట్టి రోడ్డును లే అవుట్ యాజమాన్యం వేసింది తప్ప పాలకులు మాత్రం పట్టించుకోలేదు. మరో వైపు సిపిఎం అధ్వర్యంలో 17 ఏళ్లుగా పోరాడితే కరెంట్, ఇంటి పన్నులు వేశారు. రోడ్లు, కాలువలు,.తాగునీటి సరఫరా వంటి సౌకర్యాల కల్పనకు ఇక్కడి ప్రజలు నోచుకోలేదు.


పనిచేయని బోరు

తాగునీటికి కొద్ది దూరంలో ఉన్న ఎల్‌బిజి నగర్‌లో ఉన్న బోరు తప్ప మరో అధారం లేదు. ఎల్‌బిజి నగర్ వాసులకూ అదే బోరు దిక్కు. గతంలో తాటిపూడి నుంచి విజయనగరం వాసులకు వచ్చే ప్రధాన పైప్ లైన్ లీకేజీ నీటిని కొంతకాలం వీరంతా పట్టుకున్నారు. లీకేజీని మూసివేయడంతో ఆ నీటికి కూడా నోచుకోని దుస్థితి నెలకొంది. మరోవైపు మరుగుదొడ్లు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇద్దరు ముగ్గురు కలిసి బయట చెరువులోకి, లేదా బయట ఉన్న ఓపెన్ స్థలంలోకి వెళ్లి కాల కృత్యాలు తీర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇళ్ల పట్టాల కోసం సిపిఎం ఆధ్వర్యాన ఈ పేదలంతా పోరాటం చేశారు. ఆ సమయంలో పట్టాలు ఇస్తామని చెప్పిన పాలకులు తరువాత వాటి గురించి పట్టించుకోలేదు. పిల్లలు చదువులకు మూడు కిలోమీటర్లు దూరంలో ఉన్న రామవరం హైస్కూలుకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంకోవైపు పేదలకు న్యాయం చేయాల్సిన కొంతమంది నాయకులు పేదలు ఇళ్లను కబ్జా చేసి ఆక్రమించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. సౌకర్యాలు కల్పించకపోగా అక్కడినుంచి వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎన్నికల్లో ఓట్లు కోసం వచ్చే పాలకులు వినాయకనగర్ వాసుల దుస్థితికి ఎటువంటి హామీలిచ్చి ఆదుకునే ప్రయత్నం చేస్తారో వేచి చూడాల్సిందే.

కనీస సౌకర్యాలు కల్పించండి



అధికారులు, పాలకుల దృష్టికి మా సమస్యలను ఎన్నోసార్లు చెప్పుకున్నాం. చెప్పినప్పుడల్లా వినడం తప్ప మా గోడు పట్టించుకోవడం లేదు. నగరంలో పలుచోట్ల రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నారు. శివారు కాలనీలను మాత్రం కనీసం పట్టించుకోవడం లేదు. మరుగుదొడ్లు, తాగునీరు, రోడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలి.

- సత్యం అప్పలనాయుడు, వినాయక నగర్

తాగునీటి కష్టాలు తీర్చండి



17ఏళ్ల నుంచి తాగునీటి సరఫరా లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. ఎల్‌బిజి నగర్‌లో ఉన్న ఒకే ఒక్కబోరు నుంచి నీరు తెచ్చుకుంటున్నాం. నగరపాలక సంస్థ అధికారులు,పాలకులు కనీసం మా నీటి కష్టాలు గురుంచి పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా నీటి కష్టాలు తీర్చి ఆదుకోవాలి.

– కర్రి దేముడమ్మ, వినాయక నగర్

ముత్యాలమ్మ జాతర ప్రారంభం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురంలో గ్రామదేవత ముత్యాలమ్మ జాతర ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. ఉదయం నుంచి యాత్రికులు అమ్మవారిని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బండ్ల వేషాలు, జానపద నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.


జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన వివిధ వేషధారణలు

ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం గ్రామంలో కోడి పందేల స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఐదుగురిని అరెస్టు చేశారు. మూడు కోడి పుంజులను, రూ.800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తున్న చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహారాజశ్రీ విజయనగరం Ist ఎడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
IA - 7/2023 in OS - 11/2023

బిట్వీన్ :
చేబోలు రామారావు ...వాది/పిటీషనరు/ప్లెయింటిఫ్
And :
శ్రీమతి వల్లూరి రమణమ్మ మరియు ఇతరులు
..ప్రతివాదులు/రెస్పాండెంట్సు/డిఫెండెంట్సు

నోటీసు

To

D1/R1 శ్రీమతి వల్లూరి రమణమ్మ W/o లేటు బంగారయ్య, వయసు 65 సం॥, హిందూ, అంగన్వాడి ఎంప్లాయి R/of శేరిపేట గ్రామం, గరివిడి మండలం, విజయనగరం డిస్ట్రిక్ట్.

D4/R4 శ్రీమతి అరసవిల్లి రమ W/o లేటు సురేష్, వయసు 48 సం॥, హిందూ, R/of Door No-14-3-2, కొనిశవీధి, అంబటి సత్రం, విజయనగరం టౌను & జిల్లా.

D5/R5 శ్రీమతి కోసూరు ఉమ W/o నాగరాజు, వయసు 45 సం॥, హిందూ, R/of Door No-10-33, గణేష్‌నగర్, గోపాలపట్నం, విశాఖపట్నం.

D7/R7 రావివలస పార్వతీశం S/o లేటు లక్ష్మణరావు, వయసు 60 సం॥, హిందూ, కార్పెంటరు, R/of డోలాపేట, రాజాం విలేజ్ & మండలం, విజయనగరం జిల్లా.

పైన పేర్కొన్న వాది పిటీషనరు మీపై పార్టేషను దావా వేసియున్నారు. సదరు దావా O.S 11/2023 మరియు I.A 7/2023 మీ హాజరు నిమిత్తం తే 16-4-2024 దిన కలదు, కనుక ఆదినమున ఉదయం గం॥ 10-30 నిలకు స్వయంగా కాని లేక వకీలు ద్వారా కాని పైకోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేయవలయును. లేనిచే మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఆర్డరు ప్రకారం)

బెల్లాన రవి,
అడ్వకేటు, విజయనగరం.
సెల్:9440522779